# కుక్కమూతి పిందెలు

[గల్పిక]

"మన సాహిత్యం ఇంత ధ్వంసధూళి కావటానికి కారణం నన్నడగండి చెపుతాను" అన్నాడు శాస్త్రి.

"చెప్పు, చెప్పు!" అన్నాం, నేనూ మా సుబ్బారావూనూ.

"మనకు రాముడూ, కృష్ణుడూ, హరిశ్చంద్రుడూ, నలుడూ — ఇటువంటి పాత్రలు లేరు. అటువంటివాళ్లు జీవించి ఉన్నప్పుడు గొప్ప సాహిత్యం వచ్చింది. ఇవాళ రమ్మంటే ఎట్లా వస్తుంది?"

"అటువంటి పాత్రలను కల్పించి రాస్తే ఏం?" అన్నాను.

శాస్త్రి చూపుడువేలుతో తన నుదుటిమీద కొట్టుకుంటూ, "ఇది కావాలి!" అన్నాడు.

ఈమాట సుబ్బారావు కూడా ఒప్పుకున్నాడు. ఐతే సుబ్బారా వింకోటికూడా అన్నాడు: "ఈ రోజుల్లో కూడా మనుషుల్లో గొప్పతనం ఉంది. కాని అది తక్కువవాళ్లల్లో ఉంది."

గొప్పతనం తక్కువవాళ్ళలో ఉండటమనే ముక్కకు అర్థంలేదన్నాను నేను.

"నా స్నేహితుడు రామచంద్రుణ్ణి తీసుకోండి," అన్నాడు సుబ్బారావు.

నేనూ శాస్త్రి రామచంద్రుణ్ణి తీసుకోవటానికి ఒప్పుకున్నాం.

"రామచంద్రుడు మత్తగజం. వాడికి ఊరినిండా స్నేహితు రాళ్ళే!" అన్నాడు సుబ్బారావు.

శాస్త్రి నిట్టూర్చి, "ఇత నెవరో హరిశ్చంద్రుడికన్న గొప్పవాడల్లే ఉన్నాడే!" అన్నాడు.

"ఒకరోజున మా సోమయాజు లేంచేశాడంటే—" అన్నాడు సుబ్బారావు.

"అన్నాం!" అన్నాడు శాస్త్రి.

"—రామచంద్రుణ్ణి అడిగాడుగదా: ఒరే, నీకవసరం లేని ఒక అమ్మాయిని నాకు పంపించరాదుట్రా? బ్రహ్మచర్యం చేయలేక చస్తున్నాను!" అన్నాడు.

"అంటే రామచంద్రు డేంచేశాడో తెలుసునా?"

"తెలీదు!" అన్నాం.

"తను అతిగాప్రేమించే రమణమ్మని కాస్తా సోమయాజులు దగ్గిరికి పంపించేశాడు. రామచంద్రుడి స్నేహం అటువంటిది.

"ఆతరవాత ఏమయిందంటే సోమయాజులు రమణమ్మను ప్రాణంకన్న ఎక్కువగా ప్రేమించటం మొదలుపెట్టాడు. రమణమ్మ కూడా తనను అట్లాగే ప్రేమిస్తున్నట్టు కనబడ్డది.

"అయితే సోమయాజులు కూడా స్నేహపాత్రుడే కనక వాడికి అకస్మాత్తుగా అర్థమయింది — రామచంద్రుడు తన ప్రాణంతో సమానమైన మనిషిని తనకోసం పంపాడని!"

"హాత్తేరీ! కథ బలేపకడ్‌గా వచ్చిందే! తరవాత?"

"తరవాత ఇంకేముందీ? రమణమ్మను తిప్పి పంపుతూ 'ఇటువంటి పనికిమాలిన మనిషిని పంపకపోతే మానలేక

పోయినావా?' అంటూ రామచంద్రుడికొక ఉత్తరం రాశాడు సోమయాజులు!''

''ఆ తరవాత?''

''ఏమో, ఏమయిందో! గొప్పతనానికి చెప్పాను. సోమయాజులూ రామచంద్రుడూ గొప్పవాళ్లు కాదంటారా?''

''అబ్బో! అహల్యకంటే కూడా గొప్పవాళ్లు. కాని ఒకే ఈ ఇద్దరికన్నా కూడా ఆ అమ్మాయి గొప్పది కాదుట్రా? ఆ అమ్మాయి నిజంగా రామచంద్రుణ్ణి ప్రేమిస్తూ సోమయాజుల్ని ప్రేమించినట్టు కనపడ్డదంటే —!'' అన్నాడు శాస్త్రి.

అవునని ముగ్గురం ఏకీభవించాం.

''ఏడిశారు, వెధవలు! పనీపాటా లేక చెడిపోతున్నారు మరీనూ!'' అని మా తాత మమ్మల్ని కోప్పడ్డాడు, మేం మాట్లాడే విషయం పూర్తి అయిందని తేల్చుకుని.